శివరాత్రికి సర్వం సిద్ధం



దుర్గాఘాట్‌లో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ, అధికారులు



కలశాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్

- ముస్తాబైన పాతశివాలయం
- కెనాల్‌రోడ్డులో క్యూలైన్ల ఏర్పాట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి రోజున దుర్గాఘాట్‌లో పవిత్ర స్నానాలను ఆచరించే భక్తులు ఆపై పాతశివాలయంలోని మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం పరిపాటి. అందులో భాగంగా దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కెనాల్‌రోడ్డు నుంచి ఆలయంలోకి క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ కొత్తపేట సైకంవారి వీధిలోని శ్రీదర్భేశ్వరస్వామి దేవస్థానం, పంజా సెంటర్ సమీపంలోని హనుమత్ ఆలయంలో కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, రామ్‌గోపాల్ సత్రంలోని విశ్వేశ్వర స్వామి ఆలయం, కేటీరోడ్డులోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం (గంగానమ్మ దేవస్థానం), కొత్తపేట ఇంద్రకీలాద్రిపై రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు.

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించేందుకు దుర్గాఘాట్‌కు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ దేవస్థాన అధికారులకు సూచించారు. దుర్గాఘాట్‌లో 170కి పైగా షవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఈ రమ పేర్కొన్నారు. పుణ్యస్నానాలతో పాటు భక్తులు దుస్తులు మార్చుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలని, అదే సమయంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం వీఐపీ ఘాట్‌లో పిండప్రదానం చేయడానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. దేవస్థాన ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆదిదంపతుల నగరోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రావణబ్రహ్మ వాహనంపై శ్రీ గంగా, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి నగర వీధుల్లో భక్తులకు కనువిందు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వసంత మల్లికార్జునస్వామి దేవస్థానాలకు చెందిన స్వామి వార్ల ఉత్సవమూర్తులతో నగరోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. మేళతాళాలు, భేతాళ నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ నగరోత్సవం జరిగింది. తొలుత ఆలయంలో స్వామి వారికి 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరోత్సవంలో ఏర్పాటుచేసిన జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. తొలుత ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. సంఘం నగర అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఈఓ హేమలతాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌దీపాలతో అలంకరించిన పాతశివాలయం గోపురం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్ సమీపంలోని శ్రీ విజయేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గంగా సమేత పార్వతీ విజయేశ్వర స్వామికి స్నపనాభిషేకం చేశారు. తొలుత విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పుణ్యాహవచనం, రుత్వికరణ, అఖండ స్థాపన, అంకురారోపణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్టాపన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

హస్త కళలను ఆదరిద్దాం

కలెక్టర్ ఢిల్లీరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): చేనేత, హస్త కళలను ఆదరించాలని, కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ, లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ఆధ్వర్యాన సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో క్రాఫ్ట్ బజార్ ఏర్పాటు చేశారు. శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్, హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.



క్రాఫ్ట్ బజార్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు వెలంపలి శ్రీనివాస్, మల్లాది విష్ణు

బెల్లంకొండతో అభ్యుదయ సాహిత్యం సుసంపన్నం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగునాట అభ్యుదయ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రచయితల్లో బెల్లంకొండ రామదాసు ఒకరని ప్రముఖ పాత్రికేయులు రెంటాల జయదేవ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రముఖ రచయిత బెల్లంకొండ రామదాసు శతజయంతి సభను గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై శుక్రవారం రాత్రి జరిగింది. జయదేవ్ మాట్లాడుతూ కవిగా, నాటకకర్తగా, సినిమా వ్యక్తిగా, జర్నలిస్టుగా వివిధ రూపాల్లో అపూర్వమైన సాహిత్యాన్ని బెల్లంకొండ అందించారన్నారు. అనేక అద్భుత సాహిత్య గ్రంథాలు రాసిన బెల్లంకొండకు సరైన గుర్తింపు రాలేదన్నారు. సోషలిస్టు పత్రికకు సంపాదకులుగా పని చేసిన ఆయన అభ్యుదయ సాహిత్యాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. సినీ రంగానికి వెళ్లినా తిరిగి మళ్లీ సాహితీవేత్తగానే జీవితాన్ని గడిపారన్నారు. మరోవక్తగా సాహితీవేత్త డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ నయగర కావ్యంలో 'నా గతం', 'ఈ రోజు', 'చెరసాల' ఖండకావ్యాలు అభ్యుదయ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమానికి సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించగా అధ్యక్ష, కార్యదర్శులు మనోహరనాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



బెల్లంకొండ రామదాసు శతజయంతి సభలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ జయదేవ్

జగనన్న బీమా పథకంలో కార్మికులకు లేబర్ కార్డ్స్ తప్పనిసరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జగనన్న బీమా పథకంలో రిజిస్టర్ అయిన ప్రతి కార్మికుడికి లేబర్ కార్డ్స్ తప్పనిసరని ఎన్టీఆర్ జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారిణి రత్నకుమారి అన్నారు. అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ పథకాల అమలుపై ఇండియా లేబర్ లైన్ ఆధ్వర్యంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నేతృత్వంలో శుక్రవారం గొల్లపూడి పరిధిలోని ఐరన్ యార్డ్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇండియన్ లేబర్ లైన్ ఫీల్డ్ మొబలైజర్ ఈశ్వర్ మాట్లాడుతూ ఆపదలో..అవసరాల్లో ఉన్న కార్మికులకు ఇండియన్ లేబర్ హెల్ప్ లైన్ నెంబర్ 18008339020 అండగా ఉంటుందని చెప్పారు. గుంటూరు జిల్లా ఫీల్డ్ మొబలైజర్ సురేష్, ఇండియా లేబర్ లైన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మాధవరావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ అన్నారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ అభినందించారు. యనమలకుదురు కేకే అకాడమీకి చెందిన బి.యశ్వంత్, బాలికల విభాగంలో పి .రంగలక్ష్మి అండర్ -19 జట్టుకు, ఎస్. .లాక్షణ్యస్తుతి అండర్ -15 జట్టుకు ఎంపికయ్యారు. వీరికి క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. జేసీని కలిసిన వారిలో కేకే అకాడమీ స్థాపకులు డి. వంశీ ప్రియ, హెడ్ కోచ్ జానకిరామ్ ఉన్నారు.

కంటి, దంత వైద్య పరీక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ వాకర్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యాన శుక్రవారం కేటీ రోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు ఉచితంగా కంటి, దంత వైద్య పరీక్షలు చేశారు. మాక్సివిజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు, హాసిని హాస్పటల్స్ ఆధ్వర్యాన దంత వైద్య పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, ముసునూరి కిరణ్, వాకర్స్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు లలితారాణి, సెక్రటరీ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ రేణుక

గుణదల (విజయవాడ తూర్పు): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రేణుక అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో శుక్రవారం డిజిటల్ సిస్టమ్ సపోర్ట్ ప్రోగ్రామ్ జరిగింది. ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి లయోల కళాశాల యాజమాన్యం వీఎంసీ పాఠశాలలకు 40 కంప్యూటర్లు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యా శాఖ సూరింటెండెంట్ కుమార్, వీఎంసీ పాఠశాలల సూపర్‌వైజర్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు కెనాల్ రోడ్డులో రథోత్సవం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న బచ్చు వెంకటప్రసాద్, శ్రీరాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని శ్రీ కన్యక పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యాన మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 19న కెనాల్‌రోడ్డులో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు వెంకటప్రసాద్, రాజేష్ చెప్పారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌లోని అన్నసత్రం కమిటీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు 153 ఏళ్లుగా కెనాల్‌రోడ్డులో స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. 19వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పోలీస్ కమిషనర్ టీకే రాణా కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తారని వివరించారు. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా 18న కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యాన సత్రంలో విడిది చేసే యాత్రికులకు అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం, పేద యువతుల వివాహాలకు సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వల్లంకొండ వీరపూడిబ్రహ్మానందరావు, వల్లంకొండ ప్రసాద్, సహాయ కార్యదర్శులు డోగిపర్తి శంకరరావు, బొలిశెట్టి జగన్‌మోహనరావు (గుప్తా) కోశాధికారి చల్లా హరినారాయణ పాల్గొన్నారు.

నూతన ఆలోచనలు ఆవిష్కరించడానికే..

ఎస్సార్కేలో ఉత్సాహంగా ఐడియాతాన్

రామవరప్పాడు: విద్యార్థుల్లో నూతన ఆలోచనలను ఆవిష్కరించడానికి ఎనికేపాడు ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం 'ఐడియాతాన్ -2క23'ను ఉత్సాహంగా నిర్వహించారు. 25 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు 35 బృందాలుగా విడిపోయి తమ ఆలోచనలు, ఇన్నోవేటివ్ ఐడియాస్‌ను వెలికితీసి ప్రోటోటైప్ నమూనాలు, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ ద్వారా వివరించారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్‌లో అధునాతన పద్ధతులు వివరించి పలువురి మన్ననలు అందుకున్నారు. ప్రజెంటేషన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ధనలక్ష్మి, ప్రేమ్ సాగర్, ఈశ్వర్‌లకు ప్రథమ బహుమతి, ఆంధ్ర లయోల కళాశాలకు చెందిన శివరామ తేజ, సంపత్ కుమార్‌లకు ద్వితీయ బహుమతులు అందజేశారు. జేఎన్‌టీయూ కాకినాడ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎ. కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆశాలత, పి.కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రజెంటేషన్ ఇస్తున్న విద్యార్థినులు

ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేయండి

జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపడుతున్న రైల్వే, ఆర్ అండ్‌బీ, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులకు సంబంధించిన వివిధ స్థాయిల్లో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో పెండింగ్ పనులపై శుక్రవారం జేసీ సమావేశం నిర్వహించారు. కొండపల్లి– కాజీపేట స్టేషన్ల మధ్య జి. కొండూరు మండలంలోని చెరువు మాధవరం, తెల్లదేవరపాడు గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు గ్రామాలు, విజయవాడ నార్త్‌లోని గుణదల, విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి, జక్కంపూడి గ్రామాల్లో రైల్వే డబ్లింగ్, థర్డ్ లైన్ ఓవర్ రైల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల తుదిదశ పెండింగ్ పనులు, ఇతర ప్రక్రియలు పూర్తి చేయాలన్నారు. జగ్గయ్యపేట ముక్త్యాల వద్ద ఇన్‌ల్యాండ్ వాటర్ టెర్మినల్‌కు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నందిగామ ఆర్డీఓను ఆదేశించారు. విజయవాడ నుంచి ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిలో స్టోన్ ప్లాంటేషన్ పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారి–16, 65 విస్తరణ పనుల్లో ప్రగతి చూపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్‌కుమార్, నందిగామ, తిరువూరు ఆర్డీఓలు రవీంద్రరావు, వై.వి. ప్రసన్నలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



విచిత్ర వేషధారణల్లో చిన్నారులు



కాంతారా వేషధారణలో చిన్నారి



శిల్పంలా..

స్థానిక క్రాంబ్వే రోడ్డులోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు ధరించిన విచిత్ర వేషధారణలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు న్యాయదేవత, పిచ్చిక గూడు, కాంతార, బార్బీ గర్ల్స్, టైటానిక్, తల్లిదండ్రులను కావడిలో మోసే శ్రావణ కుమారుడు తదితర వైవిధ్యమైన వేషధారణలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ముఖ్యఅతిథులు డాక్టర్ దీప్తి షాలిని, డాక్టర్ లావణ్య ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించగా సెయింట్ జాన్స్ పాఠశాల సెక్రటరీఅండ్‌కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, ప్రెసిడెంట్ మోనికా సుమన్, అకడమిక్ హెడ్ రామభారతి, ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి వారిని సత్కరించారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)

సందడిగా వీఎంసీ స్పోర్ట్స్, కల్చరల్ మీట్



ఐజీఎం స్టేడియంలో శుక్రవారం జరిగిన వీఎంసీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో మంత్రి ఆదిమూలపు సురేష్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, కలెక్టర్ ఢిల్లీ రావు, మేయర్ భాగ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే వెలంపల్లి, దేవినేని అవినాష్ తదితరులు

బీఎస్‌ఆర్కే స్కూల్లో స్పోర్ట్స్ డే



బీఎస్‌ఆర్‌కే స్కూల్లో శుక్రవారం జరిగిన స్పోర్ట్స్‌డేలో స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, స్కూల్ సిబ్బంది, అమ్మ సభ్యులు

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానము
బ్రాహ్మణవీధి, వన్‌టౌన్, విజయవాడ

సీల్డ్ టెండరు ప్రకటన

శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానములో శ్రీ దేవతామూర్తులకు వినియోగించిన (నిర్మాల్యము) పూలతో డ్రై ఫ్లెక్లింగ్ పద్ధతిలో తయారుచేసిన ధూప్‌స్టిక్స్ మరియు అగరబత్తులు దేవస్థానము వారు నిర్దేశించిన ప్రదేశములో (5x5) స్టాల్ ద్వారా విక్రయించు వ్యాపారము నిర్వహించు లైసెన్సు హక్కునకు 5 సం॥రాల కాలమునకు ధరావత్తుగా రూ. 50,000/- డి.డి తీసి తేది: 2-3-2023 గురువారం ఉ. 10 గం.లోపు సీల్డ్ టెండర్లు వేయవలెను.

గెల్లి హరిగోపినాథబాబు
కార్యనిర్వహణాధికారి



శ్రీ వసంత మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానము (బుద్ధు వారి గుడి),
బ్రాహ్మణ వీధి, విజయవాడ-1

భక్తులందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు
మహాశివరాత్రి సందర్భంగా నేడు
స్వామి వారికి కళ్యాణమహోత్సవం
నిర్వహించబడును. కావున భక్తులందరూ స్వామి వారిని దర్శించి వారి కృపకు పాత్రులు కాగలరు

నేడు
శని త్రయోదశి సందర్భంగా
శని పాశుపత హోమం
నిర్వహించబడును

గెల్లి హరిగోపినాథ్
కార్యనిర్వహణాధికారి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com

క్లుప్తంగా

వాసవి సత్రసముదాయాల అదనపు ప్రధాన కార్యదర్శిగా దర్శి వాసు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీశైలం వాసవి సత్ర సముదాయం అదనపు ప్రధాన కార్యదర్శిగా దర్శి వాసు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన కమిటీ విస్తృత సమావేశంలో దర్శి వాసు అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ పదవికి రెండో సారి ఎన్నికైన సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు దమ్మాల మల్లికార్జున, పందిటి అశోక్ తదితరులు దర్శి వాసును కలిసి సత్కరించారు.

'విజయ' సిబ్బందికి నాణ్యతా ప్రమాణాలపై అవగాహన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) సిబ్బందికి పాల ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) రెండు రోజుల అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సాయి కుమార్, సైంటిస్ట్, బీఐఎస్ హెడ్ ఎంఏజే వినోద్., విజయ డెయిరీ ఉత్పత్తుల నాణ్యతకు చేపట్టాల్సిన విధి, విధానాలు, పరిశ్రమలో మెరుగైన పని విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, జీఎం లక్ష్మారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ భ్రమరాంబ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ వి.జగన్నాథాన్ని ప్రధాన ఆలయానికి, ప్రొవిజన్ స్టోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణిని స్టేషనరీ విభాగానికి, నాగరాజును కొండ దిగువన టికెట్ల జారీ కౌంటర్ నుంచి పేబిల్స్ విభాగానికి, కె. దుర్గాప్రసాద్‌ను టోల్‌ఫ్రీ నుంచి కొండ దిగువన టికెట్ల జారీ కౌంటర్‌కు, ఎస్. లక్ష్మణస్వామిని శారీస్, మెయిన్ టెంపుల్ నుంచి ప్రోవిజన్ స్టోర్స్‌కు, జె.ఆదినారాయణను దత్తత దేవాలయాల నుంచి కొండ దిగువన టికెట్ల జారీ కౌంటర్‌కు బదిలీ చేశారు. టి.సుబ్రహ్మణ్యంను ట్రస్టు బోర్డు నుంచి మాడపాటి సత్రానికి, ఎ. నరేంద్రను టోల్‌ఫ్రీ కౌంటర్‌కు , సీహెచ్ సాయికిరణ్‌ను సత్రాలు, కేశకండనశాల విధులతో పాటు ఇ1 బాధ్యతలు అప్పగించారు. రికార్డు అసిస్టెంట్ ఎస్. నళిని ఇంజినీరింగ్ విభాగం నుంచి పరిపాలన, స్టేషనరీ విభాగానికి, ఎన్ఎంఆర్ వి.రమణబాబును ఇంజినీరింగ్ విభాగంతో పాటు ఇ1 విధులు కేటాయించారు. జి.సాంబయ్యను మాడపాటి సత్రం నుంచి శారీస్ విభాగానికి, నాగేశ్వరరావును రైల్వే స్టేషన్ నుంచి మైక్ రూమ్ నిర్వహణ బాధ్యతలు, స్వీపర్ కె. పాపయ్యను టెంపుల్ నుంచి రైల్వే స్టేషన్ ప్రసాదాల కౌంటర్‌కు, అటెండర్ కె. వీరబాబును శారీస్ విభాగం నుంచి ట్రస్ట్ బోర్డుకు, ఎ. రాజశేఖర్‌ను ట్రస్టు బోర్డు నుంచి చీరల కౌంటర్‌కు బదిలీ చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కరెంట్ ఆఫీస్ వీధిలోని సాయిదుర్గానగర్‌రోడ్డు అభివృద్ధి పనులకు 45వ డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యులు మైలవరపు కృష్ణ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఇక్కడ సైడు కాల్వలు లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారని కృష్ణ ఈ సందర్భంగా చెప్పారు. సాయిదుర్గానగర్ రోడ్డులో సైడు కాల్వలు నిర్మించడానికి రూ.8.86 లక్షలు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు, కేదారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెజిటబుల్స్ డే

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు దైనందిన జీవితంలో ఎదురయ్యే అంశాలపై అవగాహన కల్పించాలని సిటిజన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి అన్నారు. గురునానక్ నగర్ కాలనీలోని సిటిజన్స్ పాఠశాలలో శుక్రవారం వెజిటబుల్స్ డే జరిగింది. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన కూరగాయల ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా శ్రీ కృష్ణ కల్యాణం

విజయవాడ కల్చరల్: శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో వీరుభొట్ల లక్ష్మీకుమార శర్మ ఆధ్వర్యాన ఆగమశాస్త్ర సంప్రదాయాన్ని అనుసరించి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ కృష్ణుని కల్యాణం మహాశక్తి పాశుపతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయ ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, పూర్వ ధర్మాధికారి జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.